క్లుప్తంగా

కాటంరెడ్డిని కలిసిన ప్రతాప్‌కుమార్‌రెడ్డి



కాటంరెడ్డితో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, పక్కన సుకుమార్‌రెడ్డి

అల్లూరు: ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి బుధవారం మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డిని అల్లూరులోని ఆయన నివాసం మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విష్ణువర్ధన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించినట్లు తెలియజేశారు. ఆయన్ను ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి వద్ద తీసుకెళ్లి మాట్లాడడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత మన్నెమాల సుకుమార్‌రెడ్డి, నీలం సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా వైఎస్సార్‌సీపీ ప్రచారం



కోటితీర్థం ఎస్సీ కాలనీలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చేజర్ల: మండలంలోని కోటితీర్థం ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో వైస్సార్‌సీపీ నాయకులు ఇంటింటా బుధవారం సాయంత్రం ప్రచారం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమ పథకాలు తిరిగి అమలు కావాలంటే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వల్లనే సాధ్యమవుతుందన్నారు. ఆయన ఆశీర్వాదంతో ఆత్మకూరులో ఎమ్మెల్యేగా మేకపాటి విక్రమ్‌రెడ్డిని, ఎంపీగా విజయసాయిరెడ్డిని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్ గోతం వెంకటసుబ్బయ్య, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి ఎర్రగుంట పెంచలయ్య, నర్సయ్య, శీనయ్య, వసంత, కోటి, నర్సింహులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభం



వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

కలిగిరి: కలిగిరిలో ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ఉదయగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవశ్యకతను తెలపాలన్నారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా వి. విజయసాయిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు ములకా శ్రీనివాసులురెడ్డి, దగ్గుమాటి ఆదిశేషారెడ్డి, స్థానిక నాయకులు మూలి రాఘవరెడ్డి, సానా శ్రీనివాసులురెడ్డి, మాలేపాటి వెంకటసుబ్బయ్య, నోటి మల్లికార్జున్‌రెడ్డి, మార్లేళ్ల మధుసూదన్‌రెడ్డి, సుద్దల మోహన్, బండారు మనోహర్, కూనిపోగు ఇర్మియ, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతల ప్రచారం



ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

సోమశిల: అనంతసాగరంలో బుధవారం మండల యువజన విభాగం అధ్యక్షుడు బత్రెడ్డి నాగేంద్రరెడ్డి, నెల్లూరు జిల్లా ఐటీ వింగ్ సెక్రటరీ నాపా యువరాజ్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ఏడీఎఫ్ ఏర్పాటు చేసిన అభివృద్ధి చేస్తున్నారని, రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తారంటూ ఇంటింటికి వెళ్లి ఏడీఎఫ్ ప్రచార కరపత్రాలను అందజేశారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలంటే.. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకోవాలని, ఆత్మకూరు ఎమ్మెల్యేగా మేకపాటి విక్రమ్‌రెడ్డి, ఎంపీగా విజయసాయిరెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

మేలు చేసిన పార్టీని మరవొద్దు



మహిళలతో మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి

- మోసాలు చేసే పార్టీ.. డబ్బుల ఆశ చూపుతుంది
- మూడు సార్లు మోసం చేశారు.. మళ్లీ వస్తున్నారు..
- ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: రానున్న ఎన్నికలు మీ భవిష్యత్‌కు కొలమానం. గత ప్రభుత్వాన్ని.. ప్రస్తుత ప్రభుత్వాన్ని చేశారు.. మీకు మేలు చేసిన పార్టీని మరవొద్దని ఉదయగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. మూడు సార్లు అధికారంలో ఉండి.. ప్రజలకు వీసమంత మంచి చేయని.. మోసపూరిత పార్టీ మరో సారి ప్రజలను మోసం చేయడానికి అమలు చేయని హామీలతో పాటు డబ్బులు ఎరవేయడానికి సిద్ధపడుతుందని ఆరోపించారు. ప్రజలు వీరి మాయలో పడి మోసపోవద్దని కోరారు. బుధవారం మండలంలోని బ్రహ్మేశ్వరం, ఏరుకొల్లు పంచాయతీల్లో రాజగోపాల్‌రెడ్డి విజయ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు మహిళలు హారతులిచ్చి ఘనంగా స్వాగతం పలికారు. రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఐదేళ్లుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇంటింటా సంక్షేమ పథకాలు అందించి ప్రజల అభివృద్ధే ధ్యేయంగా పాలన కొనసాగించారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి గ్రామంలో సచివాలయం, ఆర్బీకే, వెల్‌నెల్ సెంటర్, తదితర రూ.కోట్ల విలువ చేసే భవనాలు సమకూరాయన్నారు. ప్రజలకు గ్రామాలవద్దే పరిపాలన అందుతోందన్నారు. కుల, మత, పార్టీలకతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు గడప గడపకూ అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు సీఎంగా మళ్లీ జగనన్న వస్తేనే పేదలందరికీ మేలు చేకూరుతుందన్నారు. రాష్ట్రంలోని ప్రజలంతా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారం మళ్లీ చేపట్టడం ఖాయమని, ఎన్ని పార్టీలు కలిసొచ్చినా ప్రజల మద్దతు జగన్‌మోహన్‌రెడ్డికే ఉందన్నారు. సంక్షేమ పథకాలు అందిస్తున్న జగనన్నకు ప్రజలంతా బాసటగా నిలవాలన్నారు. మళ్లీ సీఎంను చేసేందుకు ప్రజలంతా ఏకమవ్వాలన్నారు. ప్రతిపక్షాల కుట్రలను ప్రజలు తెలుసుకున్నారని, వారికి సరైన సమయంలో తగిన బుద్ధి చెబుతారన్నారు. 2014 ఎన్నికల్లో మోసపూరిత హామీలిచ్చిన అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు తుమ్మల వెంగయ్యచౌదరి, సర్పంచ్ మీసాల సుబ్బరాయుడు, ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, నాయకులు వల్లూరి వెంకటరెడ్డి, సూరె రమణారెడ్డి, కరాది వెంకటేశ్వర్లు, బ్రహ్మరెడ్డి, ఎల్‌పీ కొండారెడ్డి, అన్నంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, దొంతిరెడ్డి నరసింహారెడ్డి, శ్రీహరినాయుడు, కండ్లగుంట వెంకటరెడ్డి, దశరథరామిరెడ్డి, తిరుపాల్‌నాయుడు, నరసింహరావు,సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు ఎమ్మెల్యే ఆశీర్వాదం



ఆత్మకూరు: నూతన దంపతులను అభినందిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి



జలదంకిలో నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

ఆత్మకూరు: పట్టణంలోని 9వ వార్డు నాగేంద్రపురానికి చెందిన గీతాల మల్లేశ్వరరెడ్డి, శిరీష దంపతుల కుమార్తె శివపూజిత, విష్ణువర్ధన్ రెడ్డి వివాహ వేడుకల్లో బుధవారం రాత్రి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పాల్గొన్నారు. నూతన వధువరులను ఆశీర్వదించారు. ఆయన వెంట స్థానిక నేతలు పలువురు ఉన్నారు.

వివాహ వేడుకల్లో రాజారెడ్డి

కలిగిరి: మండలంలోని కృష్ణారెడ్డిపాళెం పంచాయతీ నరసారెడ్డిపాళెంకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత వింతా వెంకటేశ్వరరెడ్డి కుమార్తె నిత్యశ్రీ వివాహ వేడుకలకు మేకపాటి రాజగోపాల్‌రెడ్డి బుధవారం హాజరయ్యారు. వధువు నిత్యశ్రీ ఆశీర్వదించారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, స్థానిక నాయకులు ఉన్నారు.

జలదంకిలో..

జలదంకి: జలదంకికి చెందిన నేలపాటి అచ్చయ్య కుమారుడు వివాహ వేడుకలకు బుధవారం ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి హాజరయ్యారు. రాజగోపాల్‌రెడ్డి నూతన వధూవరులు అనిల్‌కుమార్–చందన దంపతులను ఆశీర్వదించారు.

వైఎస్సార్‌సీపీకి జైకొట్టిన టీడీపీ యువత



యువకులకు కండువా వేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: మండలంలోని వెంకటేశ్వరపురం గ్రామానికి చెందిన టీడీపీ యువత పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీకి జైకొట్టారు. బుధవారం టీడీపీకి చెందిన గోపాల్, రమేష్, భాస్కర్, కోడూరు వెంకటకృష్ణయ్య, శివరాం, తదితరుల ఆధ్వర్యంలో యువత పట్టణంలోని ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి పార్టీలో చేరారు. తీర ప్రాంత గ్రామాల అభివృద్ధిలో ప్రభుత్వం, ఎమ్మెల్యే చూపిన చొరవతో పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి యువతకు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా యువత మాట్లాడుతూ కావలి అభివృద్ధి కోసం ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి చేసిన కృషి అభినందనీయమన్నారు. ప్రధానంగా తీర ప్రాంత గ్రామాల అభివృద్ధిలో ఆయన చూపిన చొరవ కారణంగా పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలుకరించే ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించుకునేందుకు కృషి చేస్తామని తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



మృతుడు నాగూర్ (ఫైల్)

వరికుంటపాడు: మండలంలోని తూర్పుబోయమడుగులకు చెందిన సోమవరపు నాగూర్ (48) బుధవారం సాయంత్రం ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారు. పోలీసులు, కుటుంబ సభ్యుల సమాచారం మేరకు.. మృతుడు నాగూర్ గ్రామంలో టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. ప్రతి రోజూ టిఫిన్ తయారు కోసం విద్యుత్ గ్రైండర్‌ను ఉపయోగిస్తున్నాడు. బుధవారం సాయంత్రం దోశ పిండి గ్రైండర్‌లో వేసి కలియ బెడుతుండగా, విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే కుప్ప కూలి ప్రాణాలు కోల్పోయాడు. మృతుడు ఇంటింటికి రేషన్ బియ్యం సరఫరా చేసే వాహనం డ్రైవర్‌గా కూడా విధులు నిర్వహిస్తున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ పెద్ద దిక్కు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. విషయం తెలుసుకున్న ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

గిరిజన కుటుంబానికి ఆర్థిక సాయం



గిరిజన కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న డాక్టర్ ప్రణీత్, తదితరులు

ఆత్మకూరు: మర్రిపాడు మండలం పల్లవోలుకు చెందిన పెంచలయ్య, చిన్న పుల్లమ్మ గిరిజన దంపతుల ఇంట్లో వివాహం జరగనున్న క్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నేత, ఆత్మకూరుకు చెందిన ప్రముఖ వైద్యుడు ప్రణీత్ డాక్టర్ వింజం దొరసానమ్మ, మెమోరియల్ ట్రస్ట్ తరపున రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట డాక్టర్ కుమార్, తోడేటి అశోక్, యాసిన్, ఆది, తదితరులు ఉన్నారు.

ఓటరు స్వేచ్ఛకు ప్రాధాన్యం

- పక్కాగా ఎన్నికల నియమాళి అమలు
- అభ్యర్థుల ఖర్చులపై ప్రత్యేక బృందాలు
- అధిక శాతం పోలింగ్‌కు చర్యలు
- ఫిర్యాదులపై సత్వరమే చర్యలు
- ఉదయగిరి ఆర్వో రమేష్ ప్రేమకుమార్



ఉదయగిరి ఎన్నికల అధికారి రమేష్‌ప్రేమ్‌కుమార్

ఉదయగిరి: 'ప్రజాస్వామ్యంలో ఎన్నికలకు చాలా ప్రాధాన్యం ఉంది. ఓటరు తన ఓటును స్వేచ్ఛగా వేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడం నా కర్తవ్యం. నియోజవర్గంలో ఎక్కడ ఒక్క గొడవ జరగకుండా, రీపోలింగ్‌కు తావు లేకుండా ఎన్నికలు నిర్వహించేలా గట్టిగా ఏర్పాట్లు చేస్తున్నాం. ఇందుకు ప్రజలు, రాజకీయ పార్టీల సహకారం కోరుతున్నాం. ఇప్పటికే ఎన్నికలకు సంబంధించి కొన్ని ఏర్పాట్లు పూర్తి చేయగా, మరికొన్ని పురోగతిలో ఉన్నాయి. ఎన్నికల ప్రక్రియలో ఎక్కడ ఇబ్బంది జరిగినా, ఏ ఘటనా జరిగినా నిరభ్యంతరంగా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయవచ్చు' అని ఉదయగిరి ఎన్నికల అధికారి రమేష్ ప్రేమకుమార్ చెప్పారు. ఆయన సాక్షి ఇంటర్వ్యూ.

ప్రశ్న: కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత ఎలాంటి చర్యలు చేపట్టారు?

జ: పబ్లిక్ స్థలాల్లో రాజకీయ నేతల ఫొటోలు, ఫ్లెక్సీలు తొలిగించాం. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశాం. వివిధ ప్రభుత్వ శాఖల్లో కొత్తగా చేపట్టే పనులు, జరుగుతున్న పనులు వివరాలు ఎన్నికల కమిషన్‌కు పంపాం.

ప్ర: ఎన్నికలపై మీ పర్యవేక్షణ ఎలా ఉంటుంది?

జ: ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) టీం, ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్, వీడియో సర్వైలెన్స్ టీమ్‌లు, ఎన్నికల ఖర్చులు లెక్కించే టీమ్‌లు ఏర్పాటు చేశాం. ఈ బృందాలు ఎన్నికల ప్రచారంపై ప్రత్యేకంగా నిఘా ఉంచుతాయి. అనుమతులు తీసుకున్నారా లేదా నిబంధనలు పాటిస్తూ ప్రచారం చేస్తున్నారా లేదా అనే విషయాలు పరిశీలిస్తూ నివేదికలు పంపుతాయి. మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లు ఏర్పాటు చేశాం. మూడు ఫిఫ్టల్లో 24 గంటలు విధులు నిర్వహిస్తారు. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం.

ప్ర: పోలింగ్ ప్రక్రియలో కొత్త విధానం ఏమైనా ఉందా?

జ: జిల్లా కేంద్రం నుంచి ఈవీఎంలు, ప్యాడ్‌లు రావాల్సింది. పోలింగ్ బూత్‌లకు సంబంధించిన ఈవీఎంలు కంటే అదనంగా 20 శాతం అందుబాటులో ఉంచుతాం. నియోజకవర్గంలో 323 బూత్‌లు ఉన్నాయి. వీటి పరిధిలో 2,39,856 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 85 ఏళ్లు నిండి పోలింగ్ బూత్‌లకు రాలేని స్థితిలో ఉన్న వారికి, 70 శాతం అంగవైకల్యం ఉన్న వారికి ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కొత్తగా ఎన్నికల సంఘం కల్పించింది. ఇలాంటి వారిని గుర్తించే ప్రక్రియ ప్రారంభమైంది.

ప్ర: స్ట్రాంగ్ రూంలు.. కౌంటింగ్ ఎక్కడ ఉంటుంది?

జ: మే 13 ఎన్నికల అనంతరం ఈవీఎంలు నెల్లూరులో స్ట్రాంగ్ రూంలో భద్ర పరుస్తాం. అక్కడే జూన్ 4వ తేదీ కౌంటింగ్ జరుగుతుంది.

ప్ర: ఎంత మంది సిబ్బంది పాల్గొంటారు?

జ: నియోజకవర్గంలో అసెంబ్లీ, పార్లమెంట్‌కు ఒకేసారి ఎన్నికలు ఉన్నందున మొత్తం 323 పోలింగ్ కేంద్రాల్లో 1938 మంది విధుల్లో ఉంటారు. అదనంగా కొంత మందిని రిజర్వ్‌లో ఉంచుతాం. అవసరమైన చోట వినియోగిస్తాం. వీరందరికి శిక్షణ ఇస్తాం. ఎన్నికల సజావుగా సాగేందుకు సిబ్బందికి శిక్షణ చాలా ముఖ్యమైనది. దీనిపై మాత్రమే పోలింగ్ ఆధారపడి ఉంటుంది.

ప్ర: సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్‌లు కేంద్రాలపై ఎలాంటి చర్యలు చేపట్టారు?

జ: ఎస్సైలు, సీఐలు, డీఎస్పీలు పంపిన నివేదికలను ఎస్పీ, కలెక్టరు పరిశీలిస్తారు. గత ఎన్నికల్లో ఆయా కేంద్రాల పరిధిలో జరిగినా గొడవల తీవ్రత పరిశీలిస్తాం. పోలింగ్ ఓట్లలో 75 శాతం ఓట్లు ఒకే అభ్యర్థికి వచ్చాయా.. వంటి అంశాలు పరిశీలిస్తున్నాం.

ప్ర: ప్రచారాల్లో బాలలు ఎక్కువగా కనిపిస్తున్నారు?

జ: రాజకీయ పార్టీలు నిర్వహించే ప్రచారంలో 18 ఏళ్లు నిండని బాల బాలికలు ఉండరాదు. వీరితో ప్రచారం చేయించే రాజకీయ పార్టీ నేతలపై కేసులు నమోదు చేస్తాం. ఇప్పటికే ఈ విషయమై ఆయా పార్టీల ప్రతినిధులకు తెలియజేశాం.

ప్ర: అభ్యర్థుల ఎన్నికల ఖర్చులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

జ: ఎమ్మెల్యే అభ్యర్థులు రూ.40 లక్షలు, ఎంపీ అభ్యర్థులు రూ.90 లక్షలు మాత్రమే ఖర్చు పెట్టాలి. దీనికి సంబంధించి ఓ కమిటీ ఉంది. నామినేషన్ల తర్వాత అయిన ఖర్చులు లెక్క కడుతాం. దీనిపై రాజకీయ పార్టీలకు కూడా అవగాహన కల్పించాం. ప్రతి వారం రాజకీయ పార్టీ నేతలతో సమావేశం ఏర్పాటు చేస్తాం. ఖర్చులు పెరిగితే చర్యలు తీసుకుంటాం. ఇంటి ఇంటి ప్రచారం కూడా అనుతులు తీసుకోవాలి. ప్రభుత్వం ద్వారా జీతం తీసుకునే ఎవరు కూడా ఎన్నికల ప్రచారంలో భాగస్వామ్యం కాకూడదు. జరిగితే చర్యలు తీసుకుంటాం.

ప్ర: అంతంగా ఓటర్లుకు మీరు ఇచ్చే సందేశం ఏమిటి?

జ: ప్రజాస్వామ్య ప్రక్రియలో ఎన్నికలు చాలా కీలకమైనవి. ఓటు అనేది వజ్రాయుధం లాంటిది. ఓటరు తమకు నచ్చిన వారికి స్వేచ్ఛగా, శాంతియుతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలి. అందుకు అవసరమైన అన్నీ చర్యలు చేపట్టాం. ప్రలోభాలకు, బెదిరింపులకు లొంగకుండా ఓటు వేయాలి.

కండువా వేసుకునే వరకు

భారీ ఆఫర్లు



పదో.. పాతికో ఇచ్చి.. ఆ తర్వాత ముఖం చాటేత

- కావలి టీడీపీ అభ్యర్థి వైఖరిపై కుతకుత
- ప్రచార ఖర్చులు ఇవ్వడం లేదని కార్యకర్తల ఆవేదన

కావలి : 'పడవ ఎక్కాక మల్లన్న.. ఏరు దాటాక బోడి మల్లన్న' సామెతన చందానా టీడీపీ కావలి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి వైఖరిగా ఉంది. క్వారీలతో రూ.కోట్లు కొల్లగొట్టిన కావ్య.. టీడీపీ నుంచి ఎన్నికల బరిలోకి దిగడంతో బాగా సంపాదించుకోవచ్చని చాలా మంది రాజకీయ నిరుద్యోగులు ఆశ పడ్డారు. రోజు రోజుకు టీడీపీ పరిస్థితే కాక, కావ్య గ్రాఫ్ కూడా పాతాళంలో ఉండడంతో ప్రధానంగా అధికార వైఎస్సార్‌సీపీ నేతలకు టీడీపీ కండువా కప్పుకునేందుకు రూ.లక్షల్లో ఆఫర్లు ఇచ్చాడు. కొందరు మాజీ కౌన్సిలర్లు, స్థానిక లీడర్లతో పాటు పక్క నియోజకవర్గ కార్యకర్తలకే కాకుండా.. పక్క జిల్లాల్లో స్థిరపడిన స్థానికులను పిలిపించుకుని కండువాలు వేస్తూ హడావుడి సృష్టిస్తున్నారు. ఇదే సమయంలో కావలికి చెందిన మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ఒకరు టీడీపీ కండువా కప్పుకునేందుకు కావ్య రూ.6 లక్షలు ఆఫర్ చేశాడు. ముందుగా రూ.లక్ష చేతిలో పెట్టి మిగిలినవి మళ్లీ చూసుకుందాం అంటూ కండువా కప్పేశాడు. ఆ తర్వాత మిగిలిన రూ.5 లక్షల ఊసే లేకపోవడం, బయట మాత్రం రూ.6 లక్షలు ఇచ్చినట్లు ప్రచారం చేసుకోవడంతో కండువా కప్పుకున్న మాజీ కౌన్సిలర్ కుతకుత ఉడిపోతున్నాడు. మరో నేతకు టీడీపీ కండువా కప్పుకుంటే రూ.5 లక్షలు ఇస్తామని కృష్ణారెడ్డి అనుచరులు ప్రలోభాలకు గురి చేశారు. చేతిలో రూ.50 వేలు పెట్టి కండువా కప్పేశారు. మిగిలిన డబ్బుల కోసం ఫోన్ చేస్తున్నా స్పందించడం లేదని సదరు నాయకుడు మదనపడిపోతున్నాడు.

ఆదిలోనే ఆర్థికంగా వెన్నుపోటు

టీడీపీ అభ్యర్థి మాటలకు, చేతలకు పొంతన లేకపోవడంతో పార్టీని నమ్ముకున్న కార్యకర్తలు, అభిమానులు రగిలిపోతున్నారు. ప్రచారానికి ఎంతైనా ఖర్చు పెడుదాం, కార్యకర్తల కష్టాలన్నీ తీర్చేస్తా అంటూ పెద్దపెద్ద మాటలు చెప్పి తీరా విషయంలోకి వచ్చే సరికి చేతి ఖర్చులు కూడా ఇవ్వకపోతుండటంతో కార్యకర్తల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కావ్య మాటలు నమ్మి కండువాలు కప్పుకున్న వాళ్లు కూడా తొందరపడ్డామని సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్నారని సమాచారం. కావ్యకు టికెట్ ఖరారు చేసిన తర్వాత నుంచి టీడీపీ కండువాలు వేయించుకున్న కొందరు తిరిగి సొంత గూటికి చేరుకున్నంటున్న ఉదంతాలు కూడా లేకపోలేదు. ముందుదిలే ముసళ్ల పండగ.. మా సత్తా చూపిస్తామని పార్టీలో కండువాలు కప్పుకున్న నేతలు కుతకుతలాడుతున్నారు.

ఓటమి గ్రహించే.. ఖర్చు తగ్గింపా?

ఉదయగిరి నియోజకవర్గం జలదంకి మండలానికి చెందిన కావ్య కృష్ణారెడ్డి కావలిలో ఎమ్మెల్యేగా పాగా వేయాలనే ఉద్దేశంతో కావలిలో పార్టీ కోసం నాలుగేళ్లుగా కష్టపడుతున్న మాలెపాటి సుబ్బానాయుడిని, చంద్రబాబు అరెస్ట్ సమయంలో భారీగా ఖర్చు చేసి నిరసన ప్రదర్శనలు నిర్వహించిన పసుపులేటి సుధాకర్‌కు వెన్నుపోటు పొడిచి టికెట్ సంపాదించాడు. దీంతో సుబ్బానాయుడు వర్గం కొంత కినుకు వహించగా, పసుపులేటి సుధాకర్ ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగాడు. మరో వైపు టీడీపీ అభ్యర్థిగా కావలిలో ప్రచారం ప్రారంభించిన కావ్య కృష్ణారెడ్డికి గ్రౌండ్ రియాలిటీ నిదానంగా అర్థమయింది. వైఎస్సార్‌సీపీకి కావలి కంచుకోట, తన గెలుపు అసాధ్యం అనే వాస్తవానిన గ్రహించి ఖర్చులు తగ్గించేశాడు. పరువు కోసం ఆచీతూచి ఖర్చు పెడుతుండడంతో కార్యకర్తలు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. పార్టీ కోసం సొంత డబ్బులు ఖర్చు పెట్టలేక, కావ్యపై ఆధారపడలేక అసంతృప్తి వెళ్లగక్కుతున్నారు.

మాజీ ఎంపీ మేకపాటి పరామర్శ



మర్రిపాడు: నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ రాజమోహన్‌రెడ్డి



బ్రాహ్మణక్రాకలో దేవరపల్లి ఆదెమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మేకపాటి

మర్రిపాడు: మండలంలోని పడమటినాయుడుపల్లి వైఎస్సార్‌సీపీ నేత పోలంరెడ్డి చిన్నారెడ్డి సోదరుడు వెంకటేశ్వరరెడ్డి బుధవారం మృతి చెందాడు. ఈవిషయం తెలుసుకున్న నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి గ్రామానికి చేరుకుని వెంకటేశ్వర్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు మాజీ మండల కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు, చెన్ను వెంకటేశ్వర రెడ్డి, ఎద్దల శ్రీనివాసులరెడ్డి, దుగ్గిరెడ్డి కృష్ణప్రసాద్‌రెడ్డి, చిన్నారెడ్డి, కృష్ణంరాజు తదితరులు ఉన్నారు.

ఈశ్వరరెడ్డి కుటుంబానికి రాజారెడ్డి పరామర్శ

జలదంకి: మండలంలోని బ్రాహ్మణక్రాకలో దేవరపల్లి ఈశ్వరరెడ్డి తల్లి ఆదెమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పరామర్శించారు. ఆదెమ్మ మృతదేహానికి రాజగోపాల్‌రెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ తిప్పారెడ్డి ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి భారీగా వైఎస్సార్‌సీపీలో చేరికలు



పార్టీలో చేరిన నేతలకు కండువా వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: పట్టణంలోని 36వ వార్డులో టీడీపీ ఖాళీ అయిపోయింది. ఆ వార్డు ఇన్‌చార్జి సహా పలువురు నాయకులు, కార్యకర్తలు బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వార్డు టీడీపీ ఇన్‌చార్జి మల్లవరపు శివకుమార్ ఆధ్వర్యంలో కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు పెద్ద సంఖ్యలో పట్టణంలోని ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్‌రెడ్డి నివాసానికి చేరకుని పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ కావలి పట్టణంతో పాటు నియోజకవర్గంలోని మారుమూల ప్రాంతాలను కూడా అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి వంటి అక్రమార్కులకు ఓటు వేస్తే అభివృద్ధి కుంటుపడటంతో పాటు పట్టణంలో శాంతిభద్రతలు కూడా క్షీణిస్తాయన్నారు. ఇప్పటికే రౌడీలు, అల్లరి మూకలతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న టీడీపీ అభ్యర్థి వైఖరి నచ్చక టీడీపీ నాయకులంతా పార్టీని వీడుతున్నట్లు వివరించారు.

బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి



పారిశుధ్య కార్మికులకు బీమాపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆత్మకూరు: తపాలా శాఖ పారిశుధ్య కార్మికుల కోసం నూతనంగా ప్రవేశ పెట్టిన బీమా సౌకర్యం సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ ఏఎస్పీ అహమ్మద్ హుస్సేన్ తెలిపరాఉ. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఎంజీఆర్ సమావేశ మందిరంలో కమిషనర్ షేక్ ఫజులుల్లా ఆధ్వర్యంలో బుధవారం కార్మికులకు తపాలా శాఖ నూతనంగా ప్రవేశపెట్టిన బీమా పాలసీపై బుధవారం అవగాహన కల్పించారు. సంవత్సరానికి కేవలం రూ.755లతో రూ.15 లక్షలు బీమా సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పిస్తుందని విశదీకరించారు. ఏఎస్ఎం గిరీష్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు ప్రాణాలకు తెగించి విధులు నిర్వహిస్తుంటారని, అలాంటి క్రమంలో ప్రమాదాలు చోటు చేసుకుంటే కార్మికుల కుటుంబాలు వీధిన పడతాయన్నారు. వారి సంక్షేమం కోసం అతి తక్కువ ప్రీమియంతో ఎక్కువ బీమా సౌకర్యం కల్పించే ఈ పాలసీని అవగాహన చేసుకోవాలని కోరారు.